# సభకి నమస్కారం

**-తులసీ బాలకృష్ణ**

గతరాత్రి ఆదికేశవులకి స్థానిక టౌన్‌హాల్లో సన్మానం జరిగిందన్న వార్తని పేపర్లో చూస్తున్న శేషావతారానికి తన హోల్‌సేల్ షాపులో ఎదురుగా కనిపిస్తున్న బస్తా ఎండుమిరపకాయల్ని పరపర నమిలేసినంత కడుపు మంటగా ఉంది.

'నా ఎదురుగా చిరిగిన నిక్కరు, మాసికలు పడ్డ చొక్కాతో, చేతిలో పుణుకుల బుట్టతో తచ్చాడిన వెధవ, మిర్చిబండీకి, కాకా హోటల్‌కి, చివరికి హోటల్ లెవెల్‌కి ఎదిగిపోయాడు. 'శ్రమరత్న' బిరుదుతో సన్మానం కొట్టేసాడు. మొదట్నుంటీ ఊరు మొత్తానికి పెద్ద కిరాణా షాపు ఓనర్ని, హోల్‌సేల్ బిజినెస్ వ్యాపారిని, రియల్ ఎస్టేట్ బ్రోకర్ని నాకే జరగలేదు సన్మానం... ఆడికి సన్మానమా?' అంటూ రోడ్డు రోలర్ రాళ్ల రోడ్డుమీద నడుస్తున్న ధ్వనితో పళ్లు పటపటలాడించాడు.

కడుపులో దావానలంలా మండుతున్న మంటని ఓర్చుకోలేక ఆదికేశవులుకి సన్మానం జరగడంతో పాల్గొన్న వ్యక్తుల గురించి, అసలు ఆ కార్యక్రమానికి ప్రపోజ్ చేసిన వాళ్ల గురించి జరిగిన విధానం గురించీ రహస్యంగా వాకబు చేయించాడు శేషావతారం.

సన్మానం చేస్తామంటూ ఆదికేశవుల్ని బలవంతంగా ఒప్పించిన వ్యక్తి గుర్నాథం అని తెలిసింది.

వెంటనే గుర్నాథానికి కబురెళ్లింది. ఆఘమేఘాలమీద వచ్చి శేషావతారం ముంగిట వాలాడు గుర్నాథం చేతులు కట్టుకుని.

"గుర్నాథం! నీకు అనేకసార్లు అరువు ఇచ్చానే! ఇంత ద్రోహం చేస్తావా? ఆదికేశవులుగాడు నాకంటే గొప్పోడా? వాడికి సన్మానం చేస్తావా?'' నిప్పులు కక్కుతూ ప్రశ్నించాడు శేషావతారం.

మోకాళ్లమీద కూలబడి రెండు చేతులూ జోడించిన గుర్నాథం "అయ్యబాబోయ్! తమరు ఆగ్రహిస్తే నేనీ ఊళ్లో బ్రతగ్గలనా? తమతో పోలిస్తే ఆ ఆదికేశవులుగాడు ఏ పాటోడండీ శేషావతారంగారూ. మీరు ఒప్పుకోరేమోనని ఊరుకున్నానుగానీ ఊ అనండి చాలు ఆడి సన్మానాన్ని తలదన్నే ఘన సన్మానం వారంలో పల సేయిత్తా. ఎదవది ఖర్చుకి భయపడి పోయి ఎనగడుగేసే రకం కాదుగా తవరు నాకు తెల్సుగా?'' అన్నాడు లౌక్యంగా.

శేషావతారం ఛాతీ పొంగింది. నిజంగానే ఆదికేశవులి సన్మానాన్ని తలదన్నే సన్మానం అతి త్వరలో చేయించేసుకోవాలనే కోరిక ఎగదన్నింది. ఊరంతా అబ్బురపడేలా తన సన్మాన కార్యక్రమం ఉండాలని అనుకున్నాడు.

"తమకి సన్మానం జరిగి తీరాలి. ఖర్చు గురించి ఎనకాడొద్దు'' ఉత్సాహపరిచాడు గుర్నాథం మళ్లీ.

"సరే కానీయ్'' అన్నాడు ఆవేశంగా శేషావతారం. ఆపైన "ఈ ఊళ్లో గతంలో ఎవరికీ జరగనంత గొప్ప సన్మానం జరగాలి మరి. ప్రచారం హోరెత్తిపోవాలి. కరపత్రాలు వూళ్లో ప్రతి తలకాయకీ చేరాలి. చివరికి ఆదికేశవులుగాడి చేతిక్కూడా స్వయంగా ఇవ్వు. ఈ ఇసయం తెలిసి వాడు కుళ్లి కుళ్లి చావాలి. మరి బిరుదు మాటేమిటి?' అనడిగాడు.

"యాపార సామ్రాట్... ఎట్టా వుంది?''

ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయిన శేషావతారం, అయిదువేలు గుర్నాథం చేతుల్లో పెట్టి "ఇది అడ్వాన్స్. డబ్బుకు వెనుకాడొద్దు... ప్రిస్టేజి ముఖ్యం'' అని హెచ్చరిస్తూనే స్వేచ్ఛనిచ్చాడు.

"ఇక సూస్కోండి నా తడాఖా'' అంటూ వీధిలోకి గెంతాడు గుర్నాథం.

***

టౌన్‌హాల్‌నే కాదు, హాల్‌కి దారి తీసే దారులన్నింటినీ రంగురంగుల కాగితపు దండలతో, జండాలతో అలంకరించారు.

పదడుగుల ఎడంగా స్తంభాలకు శేషావతారం కటౌట్‌లని ఉరేసినట్టు వ్రేల్లాడదీసారు. స్వాగత తోరణాలు, బ్యానర్లు కట్టారు. ఉరిసికాయలంత రంగురంగుల బల్బుల తోరణాలతో ఆ ప్రాంగణం అంతా మెరిసిపోతూ ధగధగలాడిపోతోంది.

అలంకరించిన ఓపెన్ టాప్ జీపులో ఊరేగుతూ వచ్చాడు పట్టుబట్టలు కట్టుకున్న శేషావతారం. భాజాభజంత్రీలు జనాల కర్ణభేరుల్ని పగలగొట్టాయి.

గుర్నాథం ఏర్పాటుచేసిన మనుషులు జయజయధ్వానాలు పలికారు.

ఆదికేశవులకి మున్సిపల్ ఛైర్మన్ చేతులమీదుగా సన్మానం జరిగింది కాబట్టి ఈ సన్మానం అంతకంటే ఖచ్చితంగా ఘనంగా ఉండాలికాబట్టి మినిస్టరుగారిని ఎంతో కష్టపడి ఒప్పించాడు గుర్నాథం.

ఆయనతోపాటు ఎప్పటికయినా ఎన్నిపాట్లు పడయినా జ్ఞానపీఠాన్ని అధిరోహించాలని కలలు కంటూ ఆరాటపడే ఓ కవినీ స్టేజీ ఎక్కించారు. స్థానిక కన్స్యూమర్ ఫోరం ప్రెసిడెంట్ మిరపకాయల దుర్వాసులుగార్ని అధ్యక్షస్థానంలో కూర్చోబెట్టారు.

ప్రత్యేక ఆకర్షణగా శేషావతారం అర్ధాంగి శ్రీమతి సుబ్బరాజును కూడా స్టేజీమీద కూర్చోబెట్టారు. ఇంకా కొందరు పుర ప్రముఖుల్నీ, అనర్గళంగా ఎవర్నయినా ఆశువుగా పొగిడేయగల ఓ

లెక్చరర్‌గార్నీ స్టేజీ ఎక్కించారు.

అందరి స్పీచ్‌లు అయ్యాక సన్మానమా? సన్మానమయ్యాక స్పీచ్‌లా అనే మీమాంస వచ్చింది.

"ముందు సన్మానమే కానీండి" అని ఆర్డరేసింది శ్రీమతి సుబ్బరాజు. తన భర్త సన్మాన శోభతో కళకళలాడుతుండగా, అలంకరించిన దైవవిగ్రహంలా ఆయనగారు కదలకుండా కూర్చుని వుంటే, స్పీచ్‌లు ఇస్తుంటే వీడియోలోనూ, ఫోటోల్లోనూ చాలా గొప్పగా వుంటుందనేది ఆవిడ భావన.

భార్యామణి సూచనను ఓకే చేస్తూ గుర్నాథంతో "అలాక్కానీ"మన్నాడు శేషావతారం.

మంత్రిగారు శేషావతారం నొసట తన లావుపాటి ఎడమచేతి బొటనవ్రేలిని (వేలిముద్రకి ఆ వ్రేలినే ఉపయోగించడం ఆయనకి అలవాటు మరి) ఉపయోగించి అంగుళం మందాన నాలుగంగుళాల పొడవునా దట్టంగా కుంకుమ బొట్టు అద్దాడు.


గుర్నాథం అందించగా రగ్గులా మందంగా ఉన్న బంగారు రంగు నగిషీల శాలువాని భుజాల చుట్టూ కప్పాడు.

మరో ఇద్దరు కార్యకర్తల సాయంతో గజమాలని మెళ్లో దిగేసారు.

ఇహ అక్కడ్నుంచీ ఒకరొకరుగా దండయాత్ర ప్రారంభమయింది. కస్టమర్లు, చిల్లర వ్యాపారస్థులు, బంధువులు, స్నేహితులు... ప్రవాహంలా దండలతో వచ్చి శేషావతారం మెళ్లో వేయడం, అటెండెన్స్‌నీ, దండలు వేయడాన్నీ కన్‌ఫర్మ్ చేయడానికి ప్రూఫ్‌గా ముప్పయి రెండు పళ్లూ బయటపెట్టి ఫోటోలు దిగడం...గంటసేపు సాగింది తతంగం.

దండల్లో పూర్తిగా మునిగిపోయాడు శేషావతారం.

ఆనందంతో శ్రీమతి సుబ్బరాజు ముఖం పెట్రోమాక్సులైటులా గుప్పున వెలుగుతోంది.

"ఇక అభినందన ఉపన్యాసాలు" అన్నాడు అధ్యక్షుడు.

"నేను ముందు మాట్లాడతా"నంది శ్రీమతి సుబ్బరాజు చెయ్యెత్తి.

"అమ్మా! ముందుగా అతిథులు మాట్లాడితే బావుంటుందమ్మా" అన్నాడు గుర్నాథం ఆమె చెవిలో గుసగుసగా.

ఎర్రగా చూసింది ఆవిడ గుర్నాథంవైపు.


బెదిరిపోయిన గుర్నాథం "ఒక్క నిముషమమ్మా" అని రిక్వెస్టు చేసి పిల్లిలా మంత్రిగారి దగ్గరకు నడిచి నోటికి చేయి అడ్డు పెట్టుకుని అతి వినయంగా "అయ్యా! తమకి అరిజెంటు పనులున్నాయా? కొంతసేపు ఉండడానికి అభ్యంతరం లేదంటారా? ఆవిడ మందు మాటాడేత్తానంటోంది" అనడిగాడు.

అభయంగా నవ్వుతూ "నిరభ్యంతరంగా మాట్టాడ్నీండి నాకేటి తొందర్నేదు. నేను తీరుబడిగా లాస్టాకల్లో మాట్లాడ్తా" అన్నాడు మంత్రిగారు తాపీగా.



## రంభ వివాహం?

రంభ వివాహం అతి త్వరలో జరగబోతోందని వార్తలు వినవస్తున్నాయి. కెనడాలో బిజినెస్ చేస్తున్న ఇంద్రన్ అనే అతన్ని రంభ పెళ్లాడబోతున్నట్లు తెలుస్తోంది. ఇంద్రన్‌కు చెందిన కంపెనీకి రంభ మోడలింగ్ చేస్తున్నట్లు, అందుకుగాను బిఎండబ్ల్యూ కారుని బహుమతిగా రంభకు అతడు ఇచ్చినట్లు సినీవర్గాలు చెప్పుకుంటున్నారు.




'అమ్మయ్య' అనుకున్నాడు గుర్నాథం.

"అమ్మా కానీండి" అన్నాడు అధ్యక్షుడు మిరపకాయల దుర్వాసులు గారు నోటితో నవ్వుతూ, నొసటితో వెక్కిరిస్తూ.

ఆనందంగా లేచి పట్టుచీర సవరించుకుంటూ ఒకసారి అందిరవంకా చూస్తూ గునగున మైకు దగ్గరకు నడిచింది శ్రీమతి సుబ్బరాజు. గొంతు సవరించుకుంది మైకులో.

పులి గాండ్రించినట్లు వినిపించి ప్రేక్షకులు అదిరిపడ్డారు. చిన్న పిల్లలు భయంతో ఏడుపు లంభించుకున్నారు.

"సబకి నమస్కారం! నా బర్తకి జరిగినంత ఇంత గొప్ప సన్మానం ఈ వూరు వోల్ మొత్తంలో ఏ మొగాడికీ జరగలేదని సేలంజీగా సెప్పగల్ను. ఇంత కర్చు బరాయించుకోగల సత్తావున్న మొగోడెవరున్నాడు మరీ" అంటూ తన భర్త వ్యాపార దక్షత గురించీ, జ్వరమొచ్చినా జబ్బొచ్చినా, వానొచ్చినా, ఉప్పెనొచ్చినా, పెళ్లొచ్చినా, చావొచ్చినా ధైర్యం విడవకుండా కదలకుండా కొట్టునే అంటి పెట్టుకుని కూర్చునే ఆయనగారు వ్యాపారాన్ని వృద్ధి చేసి ఇంత గొప్ప స్థాయికి ఎలా వచ్చిందీ, సవివరంగా ముప్పావుగంటసేపు ఆవేశంగా వివరించింది.

ఆమె ఉపన్యాసం ముగుస్తూనే అందరితోపాటు తనూ కూడా చప్పట్లు చరచాలని శేషావతారం ఎంతగానో సంబరపడ్డాడుగానీ మణుగు బరువున్న దండల మధ్య ఉన్న అతని శరీరం, చేతులు కదపడానికి సహకరించలేదు.

శేషావతారం పడుతున్న ఇబ్బందిని ఎవరూ గమనించకపోయినా గుర్నాథం మాత్రం గమనించాడు.

అసిస్టెంట్ల సాయంతో కొన్ని దండల్ని తీసి శేషావతారానికి భారాన్ని తగ్గిద్దామని ముందడుగు వేసాడు.

గభాలున మైకందుకున్న శ్రీమతి సుబ్బరాజు "ఆ దండలు అలాగే ఉండనివ్వండి మొత్తం ఉపన్యాసాలై బిరుదు ప్రెదానం జరిగేవరకు. తీసేసేకాడ్కి ఎయ్యడం ఎందుకు? మాకేవన్నా డబ్బులెక్కువయ్యాయా?" అంటూ కస్సుమంది.

భయపడ్డ గుర్నాథం తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

అధ్యక్షులవారు లేచారు ఉపన్యసించడానికి.

మొదట శేషావతారాన్ని పొగడడంతో ప్రారంభమైన ఆయనగారి ఉపన్యాసం దారితప్పి బిజినెస్ లొసుగుల మీద కన్స్యూమర్స్ నుంచి తనకొచ్చిన రిపోర్టులమీద సాగిపోయింది.

ఇంతకీ ఆయన శేషావతారాన్ని పొగుడుతున్నాడో, తెగుడుతున్నాడో అర్థంకాక ప్రేక్షకులు బుర్రలు గోక్కున్నారు.

ఆ తరువాత కవిగారి ఉపన్యాసం సాగింది. శేషావతారం డీల్ చేసే హోల్‌సేల్ ఉప్పుపప్పుల మీద చమత్కారపూరిత పదార్థాలతో, వ్యాపారంలో ఎన్నిరకాల మతలబులుంటాయోఆ పద్యాల్లో చెప్పేసాడాయన. మళ్లీ జుట్లు పీక్కున్నారు ప్రేక్షకులు.

ఆ తరువాత మంత్రిగారు లేచారు ఉపన్యసించడానికి.

అప్పుడు అందర్నీ ఆశ్చర్యపరిచే వింత సంఘటన జరిగింది.

శేషావతారం ఎవరిమీదయితే పళ్లు నూరాడో ఆ ఆదికేశవులు ఓ బరువైన శాలువాతోటీ, అందంగా కట్టిన గజమాలతోటీ, నవ్వుముఖం సాయంతోటీ స్టేజీమీదకొచ్చి దండల్లో మునిగివున్న శేషావతారానికి అలంకరించి పాదాభివందనం చేసాడు.

శేషావతారానికి ఏమీ కనిపించలేదుగానీ బరువు పెరిగేసరికి కొద్దిగా కదిలాడు.

'అదీ అలారా దారికి. నా మొగుడికంటే గొప్పోడివా?' అన్నట్లుగా ఆదికే

శవులు దిక్కు ఓరగా చూస్తూ గర్వంగా నవ్వుకుంది శ్రీమతి సుబ్బరాజు.

శేషావతారానికి మెడమీద ఏదో పురుగు ప్రాకుతున్నట్లు అనిపించి మెలికలు తిరిగాడు.

తుడుచుకుందామంటే చేతులు కదలడంలేదు. ఆ జీవి ఏదో వీపుమీదకు ప్రాకుతోంది.

చాలా ఇబ్బందిగా, ప్రయత్నపూర్వకంగా కదిలాడు. చాలా ఇబ్బంది పడుతున్నాడు. ఒళ్లంగా దురదగా ఉంది.

ఆదికేశవులు పంటి బిగువున నవ్వాపుకున్నాడు.

మంత్రిగారు రాబోయే ఎలక్షన్ల గురించీ, ఆ ఎలక్షన్లలో తమ పార్టీనే ఎన్నుకోవాల్సిన అవసరం గురించీ, ఓ వాక్యం శేషావతారం గురించీ మొత్తం మీద ఓ గంటసేపు ఆవేశంగా ఉపన్యసించి కూర్చున్నారు.

"ఇప్పుడు శేషావతారంగారి స్పందన, ఆ తరువాత బిరుదు ప్రదానం'' అన్నాడు అధ్యక్షుడు.

"ముందే బిరుదు ప్రదానం జరగాలి'' ఎంతగానో ఆవేశపడింది శ్రీమతి సుబ్బరాజు.

దుర్వాసులుగారు మూడో కన్ను తెరుస్తూ "బిరుదు ఇచ్చేటప్పుడన్నా ఆయనగారి మొహం కనిపించాలికదమ్మా. ఆ మొహం ఎలా వెలిగిపోతోందో మేం చూడాలి కదమ్మా.. ఇలాగైతే ఎలా చెప్పండి'' అంటూ కస్సుమన్నాడు.

శ్రీమతి సుబ్బరాజు చల్లబడి ఊరుకుంది.

"ఇప్పుడు మీ స్పందన'' అంటూ కదిలాడు గుర్నాథం, శేషావతారాన్ని.

శేషావతారం కొద్దిగా మాత్రం కదలగలిగాడు. లేవలేకపోతున్నాడు. అతని అవస్థని గ్రహించి దుర్వాసులు "కొన్ని దండలు తియ్యండయ్యా. మరేం ఫర్వాలేదు'' అని ఆర్డరేసాడు. మంత్రిగారు కూడా అవునన్నట్లుగా తలూపారు.

తక్షణమే శేషావతారం ముఖం చుట్టూ వున్న దండల్నీ, శాలువాలనీ తొలగించిన గుర్నాథం అదిరిపడ్డాడు.

నాచుపట్టిన చెరువులో మునిగి లేచిన మనిషిలా, తుఫానులో తడిసిపోయిన శిలావిగ్రహంలా ఉన్నాడు శేషావతారం. జుట్టు, ముఖం అంతా ధారలు ధారలుగా చెమటలు.

ఇంకొన్ని దండలు తొలగించారు.

శేషావతారం ఊపిరి అందనివాడిలా ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు. విపరీతంగా ఆయాసపడుతున్నాడు.

ఇబ్బందిగా మెలికలు తిరిగిపోతున్నాడు. లేవడానికి ఓపికలేక నీరసంగా మూలుగుతున్నాడు.

గుర్నాథం గబగబా అప్పటికే చెమటతో తడిసిన ఓ శాలువాతో శేషావతారం ముఖానికీ, మెడకీ పట్టిన చెమటధారల్ని అద్దాడు. ఉత్సాహవంతుడైన ఓ వాలంటీరు స్టేజి సైడ్‌వింగ్‌లోంచి ఓ ప్లాస్టిక్ బక్కెట్‌ని తెచ్చి కుర్చీ ముందు పెట్టాడు.

అద్దిన చెమటని బాల్చీలోకి పిండాడు గుర్నాథం. కానీ మరుక్షణం మళ్లీ చెమట్లు పట్టి ధారలు కారుతుండడంతో ఇంకొన్ని దండలు తొలగించి ఛాతీ కూడా తుడిచి బాల్చీలోకి పిండాడు.

ప్రయత్నపూర్వకంగా గాలి పీల్చుకున్నాడు శేషావతారం.

నెమ్మదిగా కళ్లు తెరిచాడు. చప్పట్లు మారుమ్రోగాయి.

గుర్నాథం ఆసరాతో లేచి నిలబడ్డాడు శేషావతారం.

భర్త సన్మాన మైకంలో తన్మయత్వంలో ఉన్నాడని సంబరపడిపోయింది శ్రీమతి సుబ్బరాజు.

అందరికంటే గట్టిగా తనే చప్పట్లు చరిచింది కూడా తనివితీరా పకపకా నవ్వుతూ.

నెమ్మదిగా ఓ చేత్తో మైకును పట్టుకున్నాడు శేషావతారం. జబ్బ వదిలి దూరంగా జరిగాడు గుర్నాథం.

అంతే!

"సబకి నవస్కారం...'' అంటూనే తూలి నిభాయించుకోలేక మైకును మీద పడేసుకుంటూ కుప్పకూలిపోతూ ప్రక్కనున్న బాల్చీని తన్నేసాడు శేషావతారం.

"శేషావతారం కిక్కేడ్ ద బక్కెట్ ఆర్ నాట్?'' అని జోకేసారు అధ్యక్ష స్థానంలో వున్న మిరపకాయల దూర్వాసులువారు.

అంతే!

క్రిందపడ్డ శేషావతారాన్ని గబగబా ఆసుపత్రికి మోసుకుపోయారు.

★

## మాటల్ని రుచి చూసే వ్యక్తి

మనందరికీ ఏదైనా తింటేగానీ దాని రుచి ఏమిటో తెలియదు. కానీ జేమ్స్ వాన్నెర్టన్‌కు ఎవ్వరైనా తాము తినే పదార్థం గురించి చెబితే చాలు, చివరికి ఫోనులో చెప్పినా అతనికా పేరు విన్న వెంటనే చాలు దాని రుచి నోటికి తెలిసిపోతుందిట. అతని బ్రెయిన్‌లో ఒక రసాయనం ఉత్పత్తివల్ల అతనికలా అనిపిస్తోందని సస్సెక్స్ వర్సిటీ న్యూరాలజిస్టు డా.జామీకార్డ్ అన్నాడు. ఈ అసాధారణ స్థితిని సినస్థీషియా అంటారుట!

## ప్రమాదం తెచ్చిన నిర్లక్ష్యం

బెర్లిన్ జూలో గత కొన్ని సంవత్సరాలుగా జంతువులకి తమ చేతులతో ఆహారం తినిపిస్తున్న జూ కీపర్లని కరుస్తూ జంతువులు గాయాలు చేయడంతో తమ చేత్తో ఎవరూ తినిపించరాదని ఆర్డర్లు పాస్ చేసాడు జూ డైరెక్టర్ 55 ఏళ్ల బెర్నార్డ్. అయితే ఆమధ్య ఎవరో గెస్టులు వస్తే తమ జూ చింపాంజీ గురించి గొప్పగా చెబుతూ తన చేత్తో తనే ఓ అరటిపండును తినిపించబోయాడుట. దానికా సమయంలో ఏ పిచ్చి పట్టిందోగానీ అతని చేతిని ఎంత గట్టిగా కరిచిందంటే చూపుడు వేలు చివరి ముక్క వూడిపోయిందిట. అతనికి హాస్పిటల్‌లో రెండుగంటలపాటు ఆపరేషన్ చేసి మళ్లీ ఆ వేలి ముక్కను అతికించారుట.

-తటవర్తి

